క్లుప్తంగా

తైబజార్ వేలం



వేలంలో దక్కించుకున్న వారిని సన్మానిస్తున్న గ్రామస్తులు

కేశంపేట: కేశంపేట గ్రామంలోని తైబజార్‌తో పాటు మేకల సంతల వేలం పాటను మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. వేలం పాటలో తైబజార్‌ను రూ.2,61,000లకు గంజాయి రాంచంద్రయ్య, మేకల సంతను రూ. 2,60,100లకు గూడ మహేందర్‌లు సొంతం చేసుకున్నారు. వేలం పాటలో గతంలో కంటే అధికంగా ధర పలకడం పట్ల గ్రామస్తులు, పాలక మండలి సభ్యులు హర్షం వ్యక్తం చేసి గెలిపొందిన వారికి సన్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విద్యావతి, దశరథ, రమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో జబ్బులు మాయం



అవగాహన కల్పిస్తున్న ప్రచారకర్తలు

కేశంపేట: ధ్యానం చేయడం వల్ల జబ్బులు తగ్గుతాయని పిరమిట్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచారకర్తలు ఆంజనేయరెడ్డి, బాలకృష్ణారెడ్డిలు అన్నారు. ధ్యానంపై అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం మండల పరిధిలోని సుందరపురం, తొమ్మిదిరేకుల, లింగంధన, నిర్దవెల్లి, లేమామిడి గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రచారకర్తలు మాట్లాడుతూ.. ధ్యానం చేయడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో శివకుమార్, నవీన్, హేమంత్, వకుళాదేవి, జ్యోతి, వెంకటలక్ష్మి, శైలజ, రాధ, లక్ష్మి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు దాతల సహకారం

కొందుర్గు: మండలంలోని ముట్పూర్ ప్రాథమిక పాఠశాలకు కొందుర్గు గ్రామానికి చెందిన పెద్ది శ్రీనివాసుగుప్తా, రామకృష్ణగుప్తా రూ.20 వేల విరాళం అందజేశారు. అలాగే, ముట్పూర్ గ్రామానికి చెందిన పంబళ్ల వెంకటయ్య రూ.5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసు గుప్త మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న పేద విద్యార్థులను ప్రోత్సహించడం కోసం తాము ఈ సహకారం అందించడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మోహన్‌రావు దాతలను అభినందించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు హన్మంత్, గ్రామస్తులు సత్యనారాయణ పాల్గొన్నారు.

నష్టపోయిన పంటల పరిశీలన



బొప్పాయి తోటను పరిశీలిస్తున్న రాగమ్మ

మొయినాబాద్: ఇటీవల కురిసిన వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారి రాగమ్మ పరిశీలించారు. మంగళవారం మండల పరిధిలోని రెడ్డిపల్లిలో వర్షానికి దెబ్బతిన్న టమాట, బొప్పాయి తోటలు, ఆకుకూరలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వడగళ్ల వర్షానికి మండలంలో సుమారు 250 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచనావేశామన్నారు. ప్రధానంగా కూరగాయలు, ఆకు కూరలు, మునగ, పండ్లతోటలు దెబ్బతిన్నాయని తెలిపారు. పంటల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు.

చిల్కమర్రికి జిల్లా అవార్డు



మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ మాధవి

షాద్‌నగర్: గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న పనులు, సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పేరిట వివిధ విభాగాల్లో ఉత్తమ పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా చైల్డ్ ఫ్రెండ్లీ విభాగంలో మండల పరిధిలోని చిల్కమర్రి గ్రామానికి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం లభించింది. మంగళవారం కలెక్టరేట్‌లో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, జిల్లా కలెక్టర్ హరీష్ చేతులమీదుగా గ్రామ సర్పంచ్ మాధవి అవార్డును అందుకున్నారు. అవార్డు రావడం పట్ల పలువురు సర్పంచ్ మాధవిని ప్రత్యేకంగా అభినందించారు.

ప్రతి కార్యకర్తకు అండగా బీఆర్‌ఎస్

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొందుర్గు: ప్రతి కార్యకర్తకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జీఎం పటేల్ గార్డెన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో పాటు, ఎమ్మెల్సీ రమణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నో ఉద్యమాలు చేసి సాధించుకున్న తెలంగాణ అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. ఆయనపై నమ్మకంతో రాష్ట్ర ప్రజలు రెండుసార్లు అధికారాన్ని అప్పగించారని తెలిపారు. ముచ్చటగా మూడవసారి బీఆర్‌ఎస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని, ఇందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ పథకాలు దేశానికే రోల్‌మాడల్ నిలిచాయన్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు చేరేలా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

కొందుర్గులో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సమక్షంలో బీజేపీ మండల కమిటీ ఉపాధ్యక్షుడు ప్రేమకుమార్, నాయకులు శ్రీను, లక్ష్మయ్య, కాంగ్రెస్ నాయకులు లాలప్ప, రఘునాథ్‌గౌడ్, శ్రీకాంత్, రత్నయ్య, చిన్నా, రాజు, యాదయ్య, వెంకట్, మల్లేష్, సందీప్, బావయ్య తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు.

ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి భూమిపూజ

మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా ఉంటు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తేవడంలో మీడియా ఎంతో కీలకం అన్నారు. ఇందుకు ప్రెస్‌క్లబ్ భవనం వేదికగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పోతురాజు జంగయ్య, వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, సర్పంచ్ ఆదిలక్ష్మి, ఉప సర్పంచ్ రాజా రమేష్‌రెడ్డి ఎంపీటీసీ ఇస్తారమ్మ, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, సీనియర్ న్యాయవాది రామకృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, రాంబాల్‌నాయక్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్ భవనానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

షాద్‌నగర్: మండల పరిధిలోని నాగులపల్లి గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు మంగళవారం టీపీసీసీ సభ్యుడు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో చేరిన వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతుందన్నారు. దీంతో ప్రజలు పూర్తిగా విసుగుచెందారని అన్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్‌జోడో పాదయాత్రకు అనూహ్య స్పందన లభించిందని చెప్పారు. దీన్ని చూసి ఓర్వలేక బీజేపీ ప్రభుత్వం రాహుల్ గాంధీపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. రాహుల్ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయించడం సరికాదన్నారు.

తైబజారు వేలం పాట నేటికి వాయిదా

మొయినాబాద్: మొయినాబాద్ సంత(అంగడి) తైబజారు వేలంపాట బుధవారానికి వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉపసర్పంచ్ రాజేష్‌గౌడ్ అధ్యక్షతన వేలంపాట నిర్వహించారు. కానీ, గ్రామ పంచాయతీ నిర్ణయించిన ధర రాకపోవడంతో వేలంపాటను బుధవారానికి వాయిదా వేశారు. మంగళవారం నిర్వహించిన వేలం పాటలో పాల్గొన్నవారు రూ.4,05,000 వరకు పాడారు. కానీ కనీస వేలం ధరను గ్రామ పంచాయతీ 7,70,000 నిర్ణయించింది. బుధవారం ఉదయం 11.30 గంటలకు వేలంపాట నిర్వహిస్తామన్నారు. వేలంపాటలో పాల్గొనేవారు బుధవారం ఉదయం 11 గంటల లోపు రూ.10,000 పంచాయతీ కార్యాలయంలో డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు.

వాహనదారులకు నిబంధనలు తప్పనిసరి

రాజేంద్రనగర్ జోన్ ట్రాఫిక్ ఎస్సై ఎక్బాల్



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ఎక్బాల్

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాహనదారులు వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని రాజేంద్రనగర్ జోన్ ట్రాఫిక్ ఎస్సై ఎక్బాల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అమ్డాపూర్ చౌరస్తాలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా హెల్మెట్‌లేని వారికి చాలన్‌లు విధిస్తూ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి చాలన్‌లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు బానిసలై డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడుతున్నారని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ వాహనదారులు ప్రయాణించాలని చెప్పారు. పలు సిగ్నల్స్ వద్ద వాహనాలకు పోలీసు అధికారులు చాలన్‌లు చేశారు. పైఅధికారుల సూచనల మేరకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై గోపాల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆయుష్ కిట్ల పంపిణీ



ఆయుష్ కిట్లు పంపిణీ చేస్తున్న శీలారాణి

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని లాల్‌పహాడ్ కస్తూర్బా పాఠశాలలో మంగళవారం డాక్టర్ శీలరాణి విద్యార్థులకు ఆయుష్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయుష్ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆయుష్ మందులు వాడడం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ ఉండవన్నారు. అనంతరం విద్యార్థులకు రాగి లడ్డూలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యాదమ్మ, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంఈఓ కిష్టారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతోనే ఉత్తమ ఫలితాలు



పరీక్షప్యాడ్‌లను అందజేస్తున్న విజయ్‌కుమార్ తదితరులు

బీజేపీ నాయకుడు తులసీరామ్ విజయ్‌కుమార్

చేవెళ్ల: పదవ తరగతిలో విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని బీజేపీ నియోజకవర్గం నాయకులు వర్రీ తులసీరామ్ విజయ్‌కుమార్ అన్నారు. నియోజకవర్గంలోని పలు మండలాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలకు భయపడకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎదిగేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఎంతో మంది మహనీయులు, మేధావులు ప్రభుత్వ పాఠశాలలో చదివినవారేనని వారిని గుర్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్, బీజేపీ నాయకులు పెంటారెడ్డి, మల్లారెడ్డి, కిషన్ మోర్యా వైస్ ప్రెసిడెంట్ రాజశేఖర్, మాధవరావు, వెంకట్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనుల ప్రారంభం



సీసీ రోడ్లు పనులు ప్రారంభిస్తున్న వెంకట్‌రెడ్డి, గణేశ్ తదితరులు

నందిగామ: జంగోనిగూడలో సంపూర్ణంగా సీసీ రోడ్లు పూర్తి చేయనున్నట్లు సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు జిలెల్ల వెంకట్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జంగోనిగూడలో జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్‌తో కలిసి మంగళవారం సీసీ రోడ్ల పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. జంగోనిగూడను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కృషితో ఇప్పటికే అంతర్గత మురుగు కాల్వల నిర్మాణం పూర్తయిందని, ప్రస్తుతం వేస్తున్న సీసీ రోడ్లతో గ్రామంలోని ప్రతి వీధి పూర్తవుతుందని, సంపూర్ణంగా సీసీ రోడ్లు ఉన్న గ్రామంగా జంగోనిగూడను తీర్చిదిద్దుతున్నట్లు ఆయన వివరించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, రోడ్లను నాణ్యతా ప్రమాణాలు పాటించి నిర్మించాలని ఆయన కాంట్రాక్టర్‌కు సూచించారు. రోడ్లతో గ్రామం ఎంతో అందంగా తయారవుతుందని తెలిపారు. ఈ గ్రామంతో పాటు అంతిరెడ్డిగూడ, చంద్రాయన్ గూడ, పలు తండాలను సైతం ఆదర్శంగా తీర్చిదిద్దుతానని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుమార్ గౌడ్, వార్డు సభ్యులు సింధూ, నాయకులు మల్లేష్, శ్రీనివాస్‌రెడ్డి, ఈశ్వర్ యాదవ్, యాదయ్య, రాజు,గోవర్దన్,బాల్‌రాజ్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత భవిష్యత్



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

కొందుర్గు: విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని మంచి ఫలితాలు సాధించి ఉత్తమ భవిష్యత్ పొందాలని జీహెచ్‌ఎం శ్రీదేవి సూచించారు. మంగళవారం కొందుర్గు ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు రకాల సాంస్కృతిక నృత్యాలు చేశారు. అనంతరం జీహెచ్‌ఎం శ్రీదేవి మాట్లాడుతూ.. పదవ తరగతిలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ రమాదేవి, గ్రామస్తులు పెద్ది శ్రీనివాసు గుప్తా, రామకృష్ణగుప్తా, సుధాకర్‌గౌడ్, రామస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు



సబితారెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకుంటున్న పద్మ, నిర్మలాదేవి

షాద్‌నగర్‌రూరల్: ఐసీడీఎస్ ప్రాజెక్టులో అంగన్‌వాడీలు అందించిన సేవలకు గుర్తింపు లభించింది. మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్టులోని షాద్‌నగర్ సెక్టార్ పరిధిలో అందించిన ఉత్తమ సేవలకు వెలిజర్ల సూపర్‌వైజర్ పద్మ, బండకుంటతండా అంగన్‌వాడీ టీచర్ నిర్మలాదేవి ఉత్తమ అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సబితాఇంద్రారెడ్డి, కలెక్టర్ హరీష్, జెడ్పీచైర్ పర్సన్ అనితారెడ్డి చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. అవార్డులను అందుకున్న పద్మ, నిర్మలాదేవిని సీడీపీఓ నాగమణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలెయాదయ్య, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్, విశాల , జిల్లా అధికారిని మోతి పాల్గొన్నారు.

టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జయలక్ష్మి

షాద్‌నగర్: ఆరోగ్య సిబ్బంది టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి ఆవరణలో షాద్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, డీఈఓలు, ఏఎన్‌ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ట్యూబర్‌క్యూలోసిస్ అనే బ్యాక్టీరియా గాలి ద్వారా వ్యాపిస్తుందన్నారు. టీబీ సోకిన వారు తుమ్మడం, దగ్గడం ద్వారా వచ్చే తుంపర్ల నుంచి ఈ వ్యాధి ఇతరులకు సోకుతుందని తెలిపారు. ఈ వ్యాధి సోకిన వారికి విపరీతమైన దగ్గుతో పాటుగా జ్వరం వస్తుందన్నారు. ఛాతీ, తలనొప్పి, నీరసం, అలసట, ఆకలి, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయని పేర్కొన్నారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో వ్యాధి లక్షణాలను ఉన్న వారిని గుర్తించి వారికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించాలని సూచించారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, వారికి టీటీ వ్యాక్సిన్, ఐరన్ పోలిక్ మాత్రలు పంపిణీ చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసూతి సంఖ్య పెంచాలని సూచించారు. కంటి వెలుగు కార్యక్రమంపై గ్రామాల్లో మరింత ప్రచారం నిర్వహించి కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని శిబిరాలకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఆరోగ్య సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, పీహెచ్‌సీల వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు



మల్లికార్జున స్వామికి బోనాల ర్యాలీ

మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్ గ్రామంలో బోనాల సంబరాలు అంబరాన్నంటాయి. మండల పరిధిలోని అమ్డాపూర్‌లో గత నాలుగు రోజులు నుంచి మల్లికార్జున స్వామి నూతన దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం మల్లన్న స్వామికి మహిళలు బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పుల దరువులు, డీజే పాటలతో అమ్డాపూర్ గ్రామం మారుమోగింది. మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామివారికి భక్తులు బోనాలతో నైవేద్యాన్ని సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

ఈఓ శ్రీనివాస్, సర్పంచ్ చంద్రశేఖర్



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఈఓ శ్రీనివాస్, సర్పంచ్ చంద్రశేఖర్

షాబాద్: అంగరంగ వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం జరిగిందని దేవాదాయ -ధర్మాదాయ శాఖ ఈఓ శ్రీనివాస్, కొమరబండ గ్రామ సర్పంచ్ ఏశాల చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొమరబండ శ్రీ బుగ్గరామేశ్వస్వామి దేవాలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం కన్నుల పండుగ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు సేవా భావాన్ని అలవర్చుకోని తోటి వారికి సహాయపడాలని సూచించారు. డప్పు చప్పుడ్లు..మేళతాళాలు..మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య పార్వతీ పరమేశ్వరుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు, గ్రామస్తులు తదితరులున్నారు.

పేదల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



లబ్ధిదారులకు పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే

శంకర్‌పల్లి: పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మంగళవారం శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మోకిల, జనవాడ గ్రామాలకు చెందిన 35మంది లబ్ధిదారులకు జీఓ నంబర్ 58, 59(క్రమబద్ధీకరణ) కింద ప్రభుత్వ స్థలల్లో ఇళ్లు నిర్మాణం చేసుకున్న వారికి సర్టిఫికెట్‌లను అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో ముందంజలో ఉందన్నారు. ప్రతీ పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని తెలిపారు. గ్రామాల్లో ఇళ్లులేని వారికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లను అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, తహసీల్దార్ నయిముద్దిన్, ఆర్ఐ విక్రంరెడ్డి, తేజ, గోపులారం సర్పంచ్ పొడువ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కావాలనే రాహుల్‌గాంధీపై కుట్ర



సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

కాంగ్రెస్ నాయకుడు సత్యనారాయణరెడ్డి

చేవెళ్ల: రాహుల్‌గాంధీపై వేటు వేసి మోదీ ప్రభుత్వం తన పతనాన్ని తానే కొనితెచ్చుకుందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం సమన్వయ కమిటీ చైర్మన్, రాష్ట్ర పంచాయతీరాజ్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు పి. వెంకటస్వామిలు అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం పీసీసీ పిలుపు మేరకు మండలపార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి అధ్యక్షతన చేవెళ్ల నియోజకవర్గ స్థాయిలో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో నియోజకవర్గ నాయకులు ఎస్. వసంతం, పామెన భీమ్‌భరత్, షాబాద్ దర్శన్‌లతోపాటు నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కిందని ఆరోపించారు. రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తూ రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేశారని ఆరోపించారు. రాహుల్ చేపట్టిన భారత్ జోడో యాత్ర విజయవంతం అవుతుండడంతో ప్రజల్లో కాంగ్రెస్‌పార్టీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కుట్రతో వేటు వేసినట్లు చెప్పారు. దేశ సంపదను అంబానీ, అదానీ, మోదీలకు దోచిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసి అమ్ముకుంటున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటర్లు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, ఐదు మండలాల అధ్యక్షులు వీరేందర్‌రెడ్డి, మాణెయ్య, చంద్రశేఖర్, వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు పెంటారెడ్డి, మండల అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్, సీనియర్‌నాయకులు మధుసూదన్‌గుప్తా, ఉదయ్‌మోహన్‌రెడ్డి, గౌరిశంకర్, పెంటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని తరిమికొడదాం

టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శంకర్



నిరసన దీక్షలో మాట్లాడుతున్న శంకర్

షాద్‌నగర్‌రూరల్: ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ , ఆర్థిక నేరస్తులకు కొమ్ము కాస్తున్న బీజేపీని తరిమికొడదామని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ఫరూఖ్‌నగర్ గాంధీ చౌక్‌వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ.. దేశంలో అన్ని వర్గాల ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా భారత్ జోడో పాదయాత్రను చేపట్టారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతూ.. ప్రజల మధ్య చిచ్చు పెడుతుందని ఆరోపించారు. దేశంలోని 60శాతం ప్రజాధనాన్ని కొల్లగొట్టిన ఆర్థిక నేరగాళ్లను శిక్షించాల్సిన కేంద్రం వారిని వెనుకేసురావడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ప్రశ్నించినందుకే రాహుల్‌పై కేంద్రం కుట్రలు పన్నుతుందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌అలీఖాన్, రఘు, బాల్‌రాజ్‌గౌడ్, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, రజనీకాంత్, రాజు, జంగనర్సింలు, శేఖర్, చల్లాశ్రీకాంత్‌రెడ్డి, శ్రీనునాయక్, అర్జున్‌లక్ష్మణ్, ఖదీర్, శ్రీశైలం , శివ, స్వాములయ్య, నరేష్, సీతారాములు, మల్లేష్, నర్సింలు, అంజియాదవ్ పాల్గొన్నారు.